క్లుప్తంగా


రవికి జ్యోతీరావ్ పూలే అవార్డు



పూలే అవార్డు అందుకుంటున్న చేమూరి రవి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పల్లమాల జెడ్పీ హైస్కూలులో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న చేమూరి రవి జ్యోతీరావ్ పూలే అవార్డును అందుకున్నారు. పూలే టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తిరుపతిలోని దుర్గాబాయి దేశ్ ముఖ్ మహిళా ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో విశ్రాంత హైకోర్టు జడ్జి చంద్రకుమార్, డీఈఓ శేఖర్, రచయిత ఇంద్రవెల్లి రమేష్ చేతుల మీదుగా ఈ సత్కారం అందుకున్నారు. విద్యా రంగంలో పేద పిల్లల అభ్యున్నతితోపాటు సైన్సు ప్రాజెక్టులు రూపొందించడంలో విశేష కృషి చేసినందుకు ఈ అవార్డును ఇవ్వడం ఆనందంగా ఉందని రవి తెలిపారు.

పైపులైన్ లీకేజీకి అడ్డుకట్ట వేయరూ!



పైపులు లీకేజీ కావడం కలుషితమవుతున్న నీరు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని పొయ్య పంచాయతీలో పొయ్య కొత్తూరులో తాగునీటి పైపులు లీకేజీ కావడంతో తాగునీరు కలుషితమవుతోంది. గ్రామంలో 100 కుటుంబాల వరకు నివాసం ఉన్నాయి. పైపుల వద్ద నీరు నిలిచి దోమలకు ఆవాసంగా మారింది. కలుషితనీరు తాగడంతో రోగాల బారిన పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు ఎన్నోసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జైబాబు సేవలు మరువలేనివి

వరదయ్యపాళెం: ఉపాధ్యాయుడిగా కారాకొల్లు జైబాబు సేవలు మరువలేనివని వైఎస్సార్‌సీపీ జేసీఎస్ కన్వీనర్ చిన్నా కొనియాడారు. కోవిడ్ సమయంలో జైబాబు మరణించారు. ఆయన ద్వితీయ వర్ధంతిని సోమవారం వరదయ్యపాళెం బస్టాండ్ ఆవరణలో వారి కుటుంబ సభ్యులు, విశ్రాంత విద్యుత్ ఉద్యోగి కారాకొల్లు సుబ్బరామయ్య నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో జైబాబు కుటుంబ సభ్యులు, డైనమిక్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం



బిడ్డను చూపుతున్న 108 సిబ్బంది

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని వేణుగోపాలపురానికి చెందిన పోలమ్మ సోమవారం 108 అంబులెన్స్‌లో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. పోలమ్మకు ప్రసవ నొప్పులు వస్తున్నాయని 108 సిబ్బందికి సమాచారం వచ్చింది. దీంతో ఆమెను 108 సిబ్బంది బుచ్చినాయుడుకండ్రిగ పీహెచ్‌సీకి తీసుకొస్తుండగా మార్గమధ్యంలో మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నట్లు ఈఎంటీ మానస తెలిపారు.

మేలు చేసేది జగనన్న ప్రభుత్వమే

- సిఫార్సు లేకుండానే అర్హుల ఖాతాల్లోకి రూ.2 లక్షల కోట్లు జమ
- గడప గడపకు మనప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



లబ్ధిదారులకు బుక్‌లెట్ ఇస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి రూరల్: నిరుపేదల సమస్యలు తెలుసుకుని వారికి మేలు చేయడానికి గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఇంటింటికీ వస్తున్నామని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి తెలిపారు. సోమవారం శ్రీకాళహస్తి మండలం సుబ్బానాయుడుకండ్రిగ సచివాలయ పరిధిలోని బొక్కసంపాలెం, కొత్త పాలెంమిట్ట గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. దాదాపు 210 ఇళ్లకు ఎమ్మెల్యే వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా, లేదా? అని ఆరా తీశారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

బొక్కసంపాలెం గ్రామం నుంచి కొత్తపాలెంమిట్ట దళితకాలనీ వరకు సీసీరోడ్డు వేయాలని గ్రామస్తులు కోరారు. తొండమానుపురం చెరువు కలుజు నుంచి వచ్చే ఒరవకాలువ పూర్తిగా ధ్వంసం కావడంతో పొలాలకు సాగునీరు అందడం లేదని, దీనికి మరమ్మతులు చేయాలని రైతులు ఎమ్మెల్యేను కోరారు. తమ గ్రామంలోని మూడు తామర గుంటలు ఆక్రమణలకు గురి అయ్యాయని, వాటిని సర్వే చేసి అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. బొక్కసంపాలెం నుంచి చల్లపాల్లెం వరకు లింకు రోడ్లు వేయాలని, గ్రామంలో పూర్తిగా మురుగు కాలువలు లేవని వాటి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. కొన్ని వీధుల్లో చిన్నపాటి వర్షం పడినా నడవలేకపోతున్నామని, తమకు సిమెంట్ రోడ్లు వేయాలన్నారు. తాగునీటి కోసం రెండు చేతి పంపులు ఏర్పాటు చేయాలని చెప్పారు. పాఠశాలకు వంటగది, ప్రహరీ గోడ నిర్మించాలని చెప్పారు. సమస్యలపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. త్వరలో తమ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమం ఏర్పాటు చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, ఏపీ సీడ్స్ మాజీ డైరెక్టర్ బర్రె సుదర్శన్‌రెడ్డి, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వయ్యాల కృష్ణారెడ్డి, ఎంపీటీసీ పల్లమాల గోవిందరరెడ్డి, సర్పంచ్ కప్పా రేఖ, కందాటి ఈశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కె. సుబ్రమణ్యం, నాగరాజు, రవికుమార్, చంద్ర, సుబ్బరామిరెడ్డి, గురవయ్య, కృష్ణయ్య, హరికుమార్, శివకుమార్, గోపాల్, సౌభాగ్యమ్మ మండల కన్వీనర్ నాగోలు శ్రీనివాసులురెడ్డి, మండల యూత్ కన్వీనర్ వెంపల్ల సురేంద్రయాదవ్, ఊటా రమేష్‌యాదవ్, ఏనుగారి నాగభూషణ్‌యాదవ్, చెంచయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రాగిగుంటలో గడప గడపకు..

కేవీబీపురం: మండలంలోని తిమ్మసముద్రం సచివాలయ పరిధిలోని రాగిగుంటలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తారని ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

మళ్లీ జగనన్నే రావాలన్నదే ప్రజల ఆకాంక్ష



సత్యవేడులో సంక్షేమ పథకాల బుక్‌లెట్లను లబ్ధిదారులకు ఇస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

వరదయ్యపాళెం(సత్యవేడు): మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రిగా రావాలని ప్రజలు బలంగా కోరుకుంటున్నారని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. రాష్ట్రంలో గత నాలుగేళ్లుగా అమలు చేసిన సంక్షేమ పథకాల్లో లబ్ధి పొందినవారు 2024లో జరగబోయే ఎన్నికల్లో కృతజ్ఞత చూపి మరోసారి వైఎస్సార్ సీపీ పట్టం కట్టాలని విజ్ఞప్తి చేశారు. సోమవారం సత్యవేడు సచివాలయం-1 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఆర్టీసీ డిపో రోడ్డు, నేతాజీ రోడ్డు, కోటవీధి, ప్రభుత్వ ఆసుపత్రి వీధి, మసీదు వీధి, సాయిబాబా గుడి ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. 411 ఇళ్లకు వెళ్లి ప్రజలను పలకరించారు. అందుతున్న సంక్షేమ పథకాలు గురించి ఆరా తీశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ఆనందంతో ఉందన్నారు. గత నాలుగేళ్ల కాలంలో రూ. 1.60కోట్ల కుటుంబాలకు రూ. 2.07లక్షల కోట్లను నేరుగా వారి ఖాతాలకు జమ చేశారన్నారు. చంద్రబాబు, ఆయనకు బాకా ఊదే పచ్చ మీడియా ప్రభుత్వంపై బురద జల్లడమే పనిగా పెట్టుకున్నా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతిమ, జెడ్పీటీసీ విజయలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ సుశీల్‌కుమార్ రెడ్డి, సీనియర్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, పళ్లికొండేశ్వరాలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి బందిల బాలయ్య, స్థానిక ఎంపీటీసీలు పునిద కుమార్, గురుప్రసాద్, రాబిన్, మండల రైతు సలహా సంఘం అధ్యక్షుడు శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, సచివాలయ కన్వీనర్లు మాణిక్యం, నరేష్, ఈశ్వరయ్య, సీనియర్ నాయకులు ఆనందరెడ్డి, ఎంపీ రవి, మునివేలు, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎంపీడీఓ బాలగణేష్ సేవలు చిరస్మరణీయం



సంస్మరణ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సత్యవేడు ఎంపీడీఓ బాలగణేష్ సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం స్మరించారు. సత్యవేడు మండల ప్రగతికి ఆయన తనవంతు కృషి చేశారని, విధి నిర్వహణలో నిక్కచ్చిగా వ్యవహరించే ఆయన హఠాన్మరణం చెందడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం సత్యవేడు మండల పరిషత్ కార్యాలయంలో అన్నిశాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులతో సంస్మరణ సమావేశం ఏర్పాటు చేశారు. బాలగణేష్ చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం నల్ల బ్యాడ్జీలతో మౌనం పాటించారు. పలువురు ఎంపీడీఓ సేవలను ప్రస్తుతించారు. కార్యక్రమంలో ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యురాలు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, పళ్లికొండేశ్వరాలయ చైర్మన్‌తో పాటు నియోజకవర్గ సర్పంచుల సంఘం అధ్యక్షుడు రవిరెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు మధురాజు, సర్పంచులు శేఖర్, సన్యాసయ్య, వెంకటేష్, మునస్వామి, శ్రీరాములు రెడ్డి, ఎంపీటీసీలు రమణ, రాబర్ట్, తహసీల్దార్ శ్రీదేవి, ఎస్ఐ పురుషోత్తమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా ప్రదోష పూజలు



విశేష అలంకరణలో ఉన్న నందీశ్వరునికి హారతి ఇస్తున్న అర్చకులు

పిచ్చాటూరు: త్రయోదశి పురస్కరించుకుని నాగలాపురం మండలం సురుటపల్లె శ్రీ పళ్లికొండేశ్వరాలయంలో సోమవారం ప్రదోష పూజలకు భక్తులు పోటెత్తారు. సాయంత్రం ఆలయంలోని స్వయంభు శ్రీ వాల్మీకేశ్వరస్వామికి అభిముఖంగా ఉన్న నందీశ్వరునికి పాలు, పెరుగు, కొబ్బరినీళ్లు, చందనం, వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం పలు రకాల పుష్పాలతో నందీశ్వరుని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పండ్లను నైవేద్యంగా సమర్పించారు. వేదపండితుల మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాలు నడుమ నందీశ్వరునికి టెంకాయలు కొట్టి, కర్పూర నీరాజనాలు ఇచ్చారు. అంతకు ముందు ఆలయంలో కొలువుదీరిన శ్రీ మరగదాంబిక సమేత వాల్మీకేశ్వర స్వామి, మంగళాదేవి సమేత శ్రీ పళ్లికొండేశ్వర స్వామి, దాంపత్య దక్షిణామూర్తి, రామలింగేశ్వర స్వామిలకు ప్రత్యేక అభిషేక పూజలు చేసి అలంకరించారు. శివపార్వతుల ఉత్సవమూర్తులతో ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు. ప్రదోష పూజల ఏర్పాట్లను ఆలయ ఈఓ, ధర్మకర్తల మండలి చైర్మన్, సభ్యులు, సిబ్బంది పర్యవేక్షించారు.

ఘనంగా 'గ్రాడ్యుయేషన్ డే'



ధృవపత్రాలను అందజేస్తున్న జనార్ధన్‌రావ్

శ్రీకాళహస్తి: పట్టణంలోని ద స్కూల్‌లో సోమవారం ఘనంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. కరస్పాండెంట్ జనార్దన్‌రావ్ జే.పవార్ మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రాథమిక దశలో నేర్పించిన విద్య, క్రమశిక్షణ వారి భవిష్యత్తుకు బాటలు వేస్తుందన్నారు. అనంతరం యూకేజీ, 5వ తరగతి విద్యార్థులకు గ్రాడుయేషన్ డే నిర్వహించి జ్ఞాపికలు, ధృవపత్రాలు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ప్రధానోపాధ్యాయురాలు విశాల, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే భవిత



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ భారతి

నారాయణవనం: విద్యార్థి దశ నుంచే క్రమశిణతో కూడిన చదువుతో మంచి భవిష్యత్తుకు పునాదులు వేసుకోవచ్చునని ఎంఈఓ భారతి అన్నారు. సోమవారం మండలంలోని పాలమంగళం ఉత్తరపు కండ్రిగ ప్రాథమికోన్నత పాఠశాలలో వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా భారతి మాట్లాడారు. అందరూ ఒక లక్ష్యంగా చదవాలని కోరారు. సర్పంచ్ సాయిరవి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యత ఇచ్చి, కార్పొరేట్ స్కూళ్ల కంటే మిన్నగా వసతులు కల్పించి, విద్యార్థుల ఉన్నతికి కృషి చేస్తోందన్నారు. అనంతరం చదువుల తల్లి సరస్వతీదేవి చిత్రపటానికి పూజలు చేశారు. వివిధ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. హెచ్‌ఎం ప్రభావతి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో అగ్నిగుండ ప్రవేశం



అగ్నిగుండంలో ప్రవేశిస్తున్న భక్తులు

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేటలో ఆదివారం అర్ధరాత్రి అంకమ్మ అగ్నిగుండం కార్యక్రమాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. అమ్మవారికి పలు అభిషేకాలతో విశేషాలంకరణ చేసి పూజలు చేశారు. భక్తులు కంకణదారులై, బావుల్లో పవిత్ర స్నానమాచరించి, పసుపు దుస్తులు ధరించారు. గోవిందనామస్మరణ చేస్తూ ఆలయ పూజారి ముందుగా పూలబంతిని అగ్నిగుండంలో వేసి ప్రవేశించారు. ఆయన్ను భక్తులు అనుసరించారు. వివిధ ప్రాంతాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ముక్కంటి ఆలయానికి విరాళం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకం రూ.10,116, రుద్రాభిషేకానికి రూ.10వేలను చెన్నైకు చెందిన అనంత అప్పల నరసింహ మాధవశర్మ సోమవారం విరాళం ఇచ్చారు. ఆలయ అధికారులు దాతకు స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు నాగభూషణనాయక్, గోపాల్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

శ్రీకాళహస్తి: అగ్ని ప్రమాదాల నివారణపై సోమవారం పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ డిగ్రీ కళాశాలలో స్థానిక ఫైర్‌స్టేషన్ లీడింగ్ ఫైర్ మెన్ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. భవనంపై అంతస్థులో చిక్కుకున్న వారిని ఎలా రక్షించాలి? దట్టమైన పొగ మూలాన స్పృహ కోల్పోయిన వారిని ఎలా తీసుకురావాలి? అనే అంశాలను ప్రదర్శనపూర్వకంగా అవగాహన కల్పించారు. అలాగే వివిధ అగ్ని ప్రమాదాలను నివారించే విధానాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మధుసూదన్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇలా దూకి.. అలా ఈది..





ఎండవేడిమి తీవ్రత ఎక్కువగా ఉండడంతో యువకులు చల్లదనం కోసం బావుల్లో ఈత కొడుతూ సేదతున్నారు. బావుల్లో పైనుంచి కేరింతలు కొడుతూ దూకుతున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు బావుల్లో ఈదులాడుతూ ఎండవేడిమి నుంచి ఉపశమనం పొందుతున్నారు. - బుచ్చినాయుడుకండ్రిగ

ప్రైవేటు కర్మాగారాల కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింగరావు

శ్రీకాళహస్తి రూరల్: ప్రైవేటు కర్మాగారాల్లో పనీ చేస్తున్న వేతన జీవులకు కనీస వేతనంగా రూ.20 వేలు ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆ సంఘం ముఖ్య నాయకులతో సమావేశమై ఆయన మాట్లాడారు. ప్రైవేటు పరిశ్రమల యాజమాన్యాలు కార్మికుల శ్రమను దోచుకుంటున్నాయని, వారితో అదనపు పని గంటలు చేయించుకుని తక్కువ వేతనాలు ఇస్తున్నాయని మండిపడ్డారు. తిరుపతి జిల్లా వ్యాప్తంగా వందల సంఖ్యలో ప్రైవేటు కర్మాగారాలున్నాయని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను ఏ కర్మాగారం కూడా పాటించడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, ఉపాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య, వందవాసి నాగరాజు, గంధం మణి, పెనగడం గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీని గద్దె దించడమే వామపక్షాల లక్ష్యం'



ప్రచారభేరి నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): శ్రీకాళహస్తిలో ఈ నెల 20న నిర్వహించతలపెట్టిన సీపీఐ, సీపీఎం బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. సోమవారం మండలంలోని తొట్టంబేడులో ప్రచారభేరి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని గద్దె దించడమే లక్ష్యంగా వామపక్షాలు ముందుకు వెళ్తున్నాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నరసయ్య, మించల శివకుమార్, కృష్ణయ్య, మణి పాల్గొన్నారు.

బైపాస్‌లో ట్రాఫిక్ ఇక్కట్లు

శ్రీకాళహస్తి: పట్టణంలోని బైపాస్‌రోడ్డులో సోమవారం ట్రాఫిక్ స్తంభించింది. సోమవారం రాత్రి ఓ లారీకి చిన్న ప్రమాదం జరగడంతో తిరుపతి-నెల్లూరు మార్గంలో వాహనాలు రెండు గంటల పాటు స్తంభించిపోయాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు. శ్రీకాళహస్తి 2వ పట్టణ పోలీసులు, రూరల్ పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ఊరూరా 'జగనన్నే మా భవిష్యత్తు'



బీఎన్‌కండ్రిగ: పెద్దపాలేడులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పార్టీ నాయకులు



కేవీబీపురం : పెరిందేశంలో..



వరదయ్యపాళెం : సీఎల్ఎన్‌పల్లెలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలవ్యాప్తంగా గ్రామాల్లో నిర్వహిస్తున్న జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ అరణివి ద్యానాథరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన పెద్దపాలేడు గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు- మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని గృహసారథులు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో కలిసి నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. జగనన్న స్టిక్కర్లను తలుపులకు అతికించి, సెల్‌ఫోన్ నుంచి మిస్డ్ కాల్ ఇప్పించారు. నాయకులు తులసీరాం, భాస్కర్‌రెడ్డి, వెంకటయ్య, శంకరయ్య, పట్టాభిరెడ్డి పాల్గొన్నారు.

పెరిందేశంలో..

కేవీబీపురం: మండలంలోని పెరిందేశంలో సోమవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు పథకాల గురించి వివరించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు సుబ్బరాయనాయుడు, మాధవయ్య, నాగేష్, పాండు, సర్పంచ్ బత్తెయ్య, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

సీఎల్ఎన్‌పల్లెలో..

వరదయ్యపాళెం: మండలంలోని సీఎల్ఎన్‌పల్లె గ్రామ సచివాలయ పరిధిలో సోమవారం స్థానిక సర్పంచ్ దుద్దు వేణు, ఎంపీటీసీ సభ్యురాలు యన్నం ఉషా, సచివాలయ కన్వీనర్లు వెంపళ్ల ఉదయ్‌కుమార్, యన్నం వసంతమ్మ, ఇతర పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లను ఇంటి యజమానుల అనుమతితో అతికించారు. అలాగే వైఎస్సార్‌సీపీ టోల్‌ఫ్రీ నంబర్‌కు మిస్డ్‌కాల్ ఇచ్చి ముఖ్యమంత్రి సందేశాన్ని స్థానికులు ఆసక్తిగా విన్నారు.